ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

బుధవారం 15 మే 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.162	235	267
సూర్యాపేట	రూ.155	230	260
నల్లగొండ	రూ.158	236	278

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.0 । కనిష్ఠం 24.4

ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో పోలింగ్‌శాతం భిన్నంగా ఉంది. నల్లగొండ నియోజకవర్గంలో 2019 ఎన్నికలతో పోలిస్తే ఈ సారి 0.1శాతం పోలింగ్ తగ్గింది. అదే భువనగిరిలో గతంతో పోలిస్తే 2.36శాతం పోలింగ్ పెరిగింది. నల్లగొండ పరిధిలోని కోదాడ అసెంబ్లీ స్థానంలో అత్యధికంగా 2.90శాతం పోలింగ్ తగ్గింది. ఆ తరువాత సూర్యాపేటలో 0.21శాతం పోలింగ్ తగ్గింది. కాగా, హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 4.36శాతం పోలింగ్ పెరిగింది. ఆ తరువాత దేవరకొండలో 3శాతం, నాగార్జునసాగర్‌లో 2.49శాతం, నల్లగొండలో 1.93శాతం, మిర్యాలగూడలో 0.55శాతం పోలింగ్ పెరిగింది. భువనగిరి నియోజకవర్గం పరిధిలో ఒక్క ఇబ్రహీంపట్నం అసెంబ్లీ స్థానం మినహా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పెరిగింది. అత్యధికంగా జనగామ నియోజకవర్గంలో 6.39శాతం పోలింగ్ పెరిగింది. ఆ తరువాత మునుగోడు నియోజకవర్గంలో 5.68శాతం, ఆలేరులో 2.41, తుంగతుర్తిలో 1.84, నకిరేకల్‌లో 1.16, భువనగిరి నియోజకవర్గంలో 0.89శాతం పోలింగ్ పెరిగింది. అర్బన్ ప్రాంతాల్లో పోలింగ్‌శాతం తగ్గగా రూరల్ ప్రాంతాల్లో పోలింగ్ శాతం పెరిగింది. పట్టణాలకంటే పల్లెల్లోనే అధిక శాతం పోలింగ్ నమోదు కాగా, గెలుపోటములపై పార్టీలు విశ్లేషణల్లో మునిగాయి.



నల్లగొండలో తగ్గి భువనగిరిలో పెరిగి..

- రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో భిన్నంగా పోలింగ్ శాతం
- నల్లగొండలో 74.02 పోలింగ్ శాతం
- గతం కంటే 0.1శాతం తగ్గుదల
- భువనగిరిలో రికార్డుస్థాయిలో 76.78శాతం
- గతం కంటే 2.36శాతం పెరుగుదల



నల్లగొండ, మే 14 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): నల్లగొండ పార్లమెంట్ స్థానంలో సోమవారం జరిగిన పోలింగ్ 74.02శాతం నమోదైంది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 74.15శాతం పోలింగ్ నమోదుకాగా, ఈ సారి 0.13శాతం పోలింగ్ తగ్గింది. అయితే గత ఎన్నికల కంటే ఈసారి ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2019 ఎన్నికల్లో 11,75,703 ఓట్లు పోల్ కాగా, ఈ ఎన్నికల్లో 12,77,137 ఓట్లు పోలయ్యాయి. ప్రస్తుత ఎన్నికల్లో అత్యధికంగా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 76.34శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా దేవరకొండ నియోజకవర్గంలో 70.60శాతం నమోదైంది. కోదాడలో 75.21, నల్లగొండలో 75.20, నాగార్జునసాగర్‌లో 74.50, మిర్యాలగూడలో 73.34, సూర్యాపేటలో 73.07శాతం పోలింగ్ నమోదైంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు మధ్య హోరాహోరీ పోరు సాగగా, కాంగ్రెస్ అభ్యర్థి నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విజయం సాధించారు. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పీసీసీ ప్రధాన కార్యదర్శి కుందూరు రఘువీర్‌రెడ్డి పోటీచేయగా, బీఆర్‌ఎస్ నుంచి కంచర్ల కృష్ణారెడ్డి, బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి పోటీచేశారు. మరి విజయం ఎవరిని వరిస్తుందో తేలాల్సి ఉంది.

నల్లగొండ పార్లమెంట్ స్థానం పరిధిలో నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం ఇలా..

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం	2019లో శాతం	గతంతో పోల్చితే తేడా (శాతం)
హుజూర్‌నగర్	2,51,444	1,91,945	76.34	72.01	4.36
కోదాడ	2,45,187	1,84,415	75.21	78.11	-2.90
నల్లగొండ	2,49,411	1,87,565	75.20	73.27	1.93
నాగార్జునసాగర్	2,36,484	1,76,190	74.50	72.01	2.49
మిర్యాలగూడ	2,36,343	1,73,334	73.34	73.89	0.55
సూర్యాపేట	2,44,116	1,78,378	73.07	73.28	-0.21
దేవరకొండ	2,62,480	1,85,310	70.60	67.60	3.00
మొత్తం	17,25,465	12,77,137	74.02	74.12	-0.1

భువనగిరిలో రికార్డు స్థాయిలో 76.78శాతం పోలింగ్

యాదాద్రి, మే 13 (ఆంధ్రజ్యోతి): భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 76.78శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ స్థానాల పరిధిలోని పల్లెల్లో, పట్టణాల్లో ఓటరు చైతన్యం వెల్లువెత్తింది. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాలు ఉండగా, భువనగిరిలోనే అత్యధికంగా పోలింగ్ నమోదైంది. 2019లో జరిగిన లోక్‌సభ సభ ఎన్నికల 74.42శాతం పోలింగ్ నమోదు కాగా, ప్రస్తుత ఎన్నికల్లో 76.78శాతం పోలింగ్ నమోదైంది. గత ఎన్నికలతో పోలిస్తే ఈ సారి 2.36శాతం అధికంగా పోలింగ్ నమోదైంది. జిల్లాలో అత్యధికంగా మునుగోడులో 83.71శాతం, అత్యల్పంగా ఇబ్రహీంపట్నంలో 66.83శాతం పోలింగ్ నమోదైంది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఇబ్రహీంపట్నం, పెద్ద అంబర్‌పేట్, తుర్కయంజాల్ మునిసిపాలిటీలు ఉన్నాయి. ఈ మునిసిపాలిటీల్లో ఓటర్లు అధికంగానే ఉన్నారు.

అయితే అర్బన్ ప్రాంతంలోని ఓటర్లు ఓటు వేసేందుకు ఆసక్తి చూపలేదు. గ్రామీణ ప్రాంతంలోని నియోజకవర్గాల్లో అధిక శాతం పోలింగ్ జరిగింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 16,27,527మంది ఓటర్లు ఉండగా, 12,11,256మంది ఓటు హక్కును వినియోగించుకోగా 74.42శాతం పోలింగ్ నమోదైంది. ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో మొత్తం 18,08,585 మంది ఓటర్లు ఉండగా, 13,88,680మంది ఓటింగ్‌లో పాల్గొనగా 76.78శాతం నమోదైంది. నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నంలో 66.83శాతం, మునుగోడులో 83.71శాతం, భువనగిరిలో 82.71శాతం, నకిరేకల్‌లో 77.11శాతం, తుంగతుర్తిలో 74.68శాతం, ఆలేరులో 82.81శాతం, జనగామలో 74.68శాతం పోలింగ్ నమోదైంది. అయితే పోలింగ్ శాతం పెరగడంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు లెక్కల్లో మునిగిపోయారు. ఎవరికి అనుకూలం, ప్రతికూలమో అనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. కాగా గెలుపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

భువనగిరి పార్లమెంట్ స్థానం పరిధిలో నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం ఇలా..

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం	2019లో ఓటర్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం	గతంతో పోల్చితే తేడా (శాతం)
ఇబ్రహీంపట్నం	3,39,341	2,26,790	66.83	2,76,549	1,85,053	66.92	-0.09
మునుగోడు	2,57,557	2,15,611	83.71	2,30,161	1,79,605	78.03	5.68
భువనగిరి	2,20,596	1,82,462	82.71	2,02,028	1,65,297	81.82	0.89
నకిరేకల్	2,53,785	1,95,693	77.11	2,36,221	1,79,412	75.95	1.16
తుంగతుర్తి	2,59,265	1,92,005	74.06	2,39,558	1,73,015	72.22	1.84
ఆలేరు	2,35,270	1,94,817	82.81	2,18,123	1,53,499	80.40	2.41
జనగామ	2,42,771	1,81,302	74.68	2,24,887	1,53,499	68.29	6.39
మొత్తం	18,08,585	13,88,680	76.78	16,27,527	12,11,256	74.42	2.36

అసెంబ్లీ ఎన్నికల కంటే తగ్గిన పోలింగ్ శాతం

సూర్యాపేట(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల కంటే లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం తగ్గింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో 84.83శాతం పోలింగ్ నమోదు కాగా, లోక్‌సభ ఎన్నికల్లో 74.61శాతం నమోదైంది. లోక్‌సభ ఎన్నికల్లో 10.22శాతం ఓటింగ్ తగ్గింది. లోక్‌సభ ఎన్నికల్లో హుజూర్‌నగర్ నియోజకవర్గంలో అత్యధికంగా 76.34శాతం, కోదాడలో 75.21శాతం, సూర్యాపేటలో 73.07శాతం, తుంగతుర్తిలో 74.06శాతం ఓటింగ్ నమోదైంది. కాగా 2023 నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 86.31శాతం, కోదాడ నియోజకవర్గంలో 85.30, సూర్యాపేట నియోజకవర్గంలో 79.95, తుంగతుర్తి నియోజకవర్గంలో 87.51శాతం నమోదైంది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో 10.12లక్షల మంది ఓటర్లు ఉండగా, 7.663లక్షల మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సూర్యాపేట నియోజకవర్గంలో 2,44,116మంది ఓటర్లు ఉండగా, ఎన్నికల్లో 1,78,214మంది ఓటేశారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 2,51,444 మంది ఓటర్లు ఉండగా, 1,91,843మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కోదాడ నియోజకవర్గంలో 2,45,187 మంది ఓటర్లు ఉండగా, 1,84,261మంది ఓటేశారు. తుంగతుర్తి నియోజకవర్గంలో 2,59,612మంది ఓటర్లు ఉండగా, 1,91,845 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల తరువాత సుమారు 35వేల మందికిపైగా అర్హులైన యువత ఓటు హక్కు పొందారు. ఈ ఎన్నికల్లో 30వేలకు పైగా నూతన ఓటర్లు నూతనంగా ఓటును వినియోగించుకున్నారు.

ఎవరి ధీమా వారిదే

- భువనగిరిలో పోటాపోటీ
- గతంలో పోలిస్తే పెరిగిన పోలింగ్ శాతం

యాదాద్రి, మే 14(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికలను అన్ని పార్టీలూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచార హోరెత్తించారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో లోక్‌సభ ఎన్నికల పోరు హోరాహోరీగా జరిగింది.

పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకే ముందే నియోజకవర్గంలో రాజకీయం రసవత్తరంగా మారింది. ఈ నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీ నుంచి టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నుంచి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీఆర్‌ఎస్ నుంచి క్యామ మల్లేష్, సీపీఎం నుంచి ఎండీ.జహింగీర్ బరిలో ఉన్నారు. నెలరోజుల పాటు ప్రధాన పార్టీలు అభ్యర్థులు గెలుపుకోసం సర్వశక్తులూ ఒడ్డారు. పేదలు, నిరుద్యోగులు, ఉద్యోగులు, యువత పదేళ్ల పాలనలో అన్యాయానికి గురైనందున అన్ని వర్గాల ప్రజల తమనే ఆదరిస్తారని కాంగ్రెస్ భావిస్తోంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే తకు అనుకూలంగా ఉంటాయని అధికార పార్టీ నేతలు విశ్లేషిస్తున్నారు. పదేళ్లలో కేంద్రం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు తమను గెలిపిస్తాయని బీజేపీ, తెలంగాణలో పదేళ్ల పాటు చేపట్టిన అభివృద్ధి పథకాలే తమకు అనుకూలమని బీఆర్‌ఎస్, నిరంతరం ప్రజల్లో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసినందున ఓటర్లు తమనే ఆదరిస్తారన్న ధీమాతో మరికొంత మంది ఉన్నారు.

ఓటర్ల మొగ్గు ఎటువైపో

భువనగిరి నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో అర్బన్ ప్రాంతంలోని నియోజకవర్గాలు ఇబ్రహీంపట్నం కాగా, మునుగోడు, భువనగిరిలోని పలు మండలాలు సెమీ అర్బన్‌గా ఉన్నాయి. మిగతా నియోజకవర్గాలు గ్రామీణ ప్రాంతంతో ఉంటుంది. అయితే పట్టణ ప్రాంతాల్లో కంటే కూడా గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరిగింది. దీంతో ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపారన్న అంశంపై ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు విశ్లేషణలో నిమగ్నమయ్యారు. మంగళవారం పార్టీ ముఖ్య అనుచరులతో సమావేశమై ఏ నియోజకవర్గాల్లో ఎన్ని ఓట్లు తమ లభిస్తాయన్న దానిపై ఆరా తీసినట్లు సమాచారం. భువనగిరి నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్ పార్టీకి బలమైన కేడర్ ఉంది. అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో పాటు ఎమ్మెల్సీలు, కౌన్సిలర్లు, సర్పంచులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు ఉన్నారు. అయితే ఇటీవల చాలా మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రస్తుతం ఎమ్మెల్యేలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు తోడు కావడంతో అన్ని నియోజకవర్గాల్లోనూ మెజార్టీ ఓట్లను సాధిస్తామని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో జనగామ ఎమ్మెల్యే స్థానం మాత్రమే ఉంది. మొన్నటి వరకు కారు పార్టీలో నేతలు నిండిపోయాగా, ప్రస్తుతం ఆ పార్టీ ఖాళీ అయింది. దీంతో బీఆర్‌ఎస్‌కు ఈ నియోజకవర్గంలో భిన్నమైన పరిస్థితి నెలకొంది. దీంతో పార్టీలో ఉన్న కేడర్‌తోనే అభ్యర్థి ప్రచారం చేపట్టారు. బీజేపీ అభ్యర్థి కేంద్రం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలే ఎజెండాగా తీసుకుంది. యువతపై ఆశలు పెంచుకుంది. పలుచోట్ల క్రాస్ ఓటింగ్ జరిగినట్లు సమాచారం. ఆయా నియోజకవర్గాలోని నేతలు బీజేపీ అభ్యర్థికి ఏ మేరకు సహకరించారన్న అంశంపై చర్చ జరుగుతోంది. ఈ ఎన్నికల్లో గెలుపుపై అభ్యర్థులంతా ఆశాభావంతో ఉన్నారు. జూన్ 4వ తేదీన వెలువడే ఫలితాల వరకు సస్పెన్షన్ కొనసాగనుంది.

• 7లో..

అంకిరెడ్డిగూడెంలో రాత్రి 7గంటల వరకు పోలింగ్

ఆర్టీసీకి రూ.6.64కోట్ల ఆదాయం

కందువాలు లెక్కకు వచ్చేనా ?

హమ్మయ్య ఎన్నికలు ముగిశాయ్

పచ్చిమిర్చి కిలో రూ.120

- నానాటికీ పెరుగుతున్న కాయగూరల ధరలు
- సామాన్యులకు కూర'గాయాలు'



మిర్యాలగూడ, మే 14: రోజురోజు పెరుగుతు న్న కూరగాయల ధరలు సామాన్యులకు శరాఘాతాలవుతున్నాయి. అన్ని రకా ల కూరగాయల ధర కిలో రూ. 50కి పైనే ఉండగా పచ్చిమిర్చి ధర ఏకంగా రూ.120కి చేరింది. దీంతో మిర్చి కొనాలంటే వినియోగదారులు వణికిపోతున్నారు. కరువు పరిస్థితులకు తోడు నిత్యావసరాల ధరల బరువు అధికమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూరగాయల్లో కిలో బీరకాయ రూ. 80, బెండకాయలు, కాకర కాయలు రూ.70 రూపాయలకు చేరింది. క్యారెట్, దొండకాయ రూ. 60రూపాయలు, వంకాయలు, దోసకాయలు రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. పెరిగిన ధరలతో కూరగాయలు కొనలేక, పచ్చళ్లతో భోజనం చేయలేక ప్రజలు అల్లాడుతున్నారు.

వర్షాలు కురియక

గతేడాదిగా సరైన వర్షాలు కురియకపోవడంతో జిల్లాలో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. భూగర్భజలాలు అడుగంటడంతో బోర్లు మూతబడి తాగునీటికి కూడా పల్లెలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. సాగునీరు లేక పండ్ల తోటలు, కూరగాయల తోటలు అనేకం దెబ్బతిన్నాయి. దీంతో ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. ప్రతికూల పరిస్థితుల మధ్య కూరగాయలు, ఆకు కూరల తోటలు సాగు చేసినా సరైన ఎదుగుదల లేక పంట లు చేతికి రాకపోవడంతో కూరగాయల ధరలు పెరుగుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

గత నెలకంటే అధికం



గత నెలలో టమాట రూ. 15 నుంచి 20 విక్రయించగా ప్రస్తుతం రూ. 25 - 40కు పెరిగింది. ఏప్రిల్ నెలలో కిలో రూ. 20 ఉన్న ఉల్లిపాయల ధర ప్రస్తుతం 30కి చేరింది. 50 రూపాయలున్న బెండకాయ కిలో 70కి పెరిగింది. 100 నిమ్మకాయల ధర 450గా ఉంది. అన్ని రకాల కూరగాయలకు కేజీ సుమారు రూ. 10 నుంచి 20 వరకు ధర పెరిగాయాని వినియోగదారులు వాపోతున్నారు.

కూరగాయలు కొనేటట్లు లేదు



కూరగాయలు ధరలు అందుబాటులో లేవు. రోజు ఏదో ఓ కూరగాయ ధర అమాంతం పెరుగుతూ పోతోంది. మొన్నటి వరకు కేజీ రూ.80-90 అమ్మిన పచ్చిమిర్చి మంగళవారం 120కి పెరిగింది. పప్పులు, ఆకు కూరల ధరలు కూడా పెరుగుతున్నాయి.

- బుర్రి పార్వతి, గృహిణి, కృష్ణమానస కాలనీ

ఈవీఎంలు స్ట్రాంగ్ రూంలో భద్రం

పరిశీలించిన ఎన్నికల పరిశీలకుడు రాబర్ట్ సింగ్ క్షేత్రమయమ్

భువనగిరి రూరల్, మే 14: భువనగిరి పార్లమెంటు పరిధిలో పోలింగ్ వినియోగించిన ఈవీఎంలను పట్టణ శివారులోని ఆరోరా ఇంజనీరింగ్‌లో కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో మంగళవారం భద్రపరిచారు. ఎన్నికలు పూర్తికాగానే, ఎలక్షన్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలను నుంచి సిబ్బంది తరలించారు. పార్లమెంట్ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఈవీఎంలను కట్టుదిట్ట భద్రత నడుమ భువనగిరిలోని స్ట్రాంగ్ రూంలకు తరలించారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలో భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి, నకిరేకల్, ఇబ్రహిపట్నం, జనగామ, మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, నియోజకవర్గాల వారీగా ఈవీఎంలను ఇక్కడ భద్రపరిచారు. అనంతరం రాజకీయాల పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూంలకు సీల్ చేశారు. ఈ ప్రక్రియను కేంద్ర ఎన్నికల కమిషన్ సాధారణ పరిశీలకుడు రాబర్ట్ సింగ్ క్షేత్రమయమ్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్ భువనగిరి ఆర్డీవో పి.అమరేందర్, తహసీల్దార్ ఎస్.అంజిరెడ్డి, పలు రాజకీయాపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఈవీఎంల స్ట్రాంగ్ రూంలను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు రాబర్ట్, కలెక్టర్ జెండగే

ప్రపంచ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌కు దేవాన్ష్‌రెడ్డి



వలిగొండ, మే 14: మండలంలోని పులిగిల్ల గ్రామానికి చెందిన, ప్రవాస భారతీయుడు కొలను కమలాకర్‌రెడ్డి జ్యోతి దంపతుల కుమారుడు దేవాన్ష్‌రెడ్డి ప్రపంచ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యాడు. ఈ నెల 18వ తేదీ వరకు అమెరికాలో జరిగిన యుసీఐబీఎంఎక్స్ రేసింగ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో అతడు పాల్గొననున్నాడు. దేవాన్ష్‌రెడ్డి తల్లిదండ్రులు వృత్తిరీత్యా ఐర్లాండ్‌లో స్థిరపడ్డారు. అతడు 2023లో ఐర్లాండ్‌లో ప్రాథమిక విద్య పూర్తిచేశాడు. విద్యతోపాటు క్రీడాలు, సోషల్ సర్వీస్, క్రమశిక్షణలో అతడు ప్రతిభ కనబరిచినందుకు పాఠశాల స్పిరిట్ ఆఫ్‌ది అవార్డు కూడా అందజేసింది. చిన్నతనం నుంచే సైక్లింగ్‌లో పట్టు సాధిస్తున్న దేవాన్ష్‌కు బంధువులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

ధాన్యం కొనుగోలుకు లైన్ క్లియర్



భూదాన్‌పోచంపల్లి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

భూదాన్‌పోచంపల్లి, మే 14: మండల వ్యాప్తంగా ధాన్యం కొనుగోలుకు లైన్ క్లియర్ అయింది. ఇటీవల లారీ డ్రైవర్‌పై ఓ మిల్లు యజమాని దాడి చేయడంతో వారు ధాన్యం ఎగుమతిని నిలిపివేశారు. దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ధర్నా నిర్వహించగా, చివరికి మిల్లర్ లారీ డ్రైవర్‌కు క్షమాపణ చెప్పడంతో విషయం సద్దుమణిగింది. ధాన్యం కొనుగోలుకు మార్గం సుగమమైంది.

ధాన్యాన్ని వెంటనే కొనుగోల చేయాలని మంగళవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద అఖిలపక్షం ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సోమవారం కనుముకుల గ్రామంలో తడిసిన వరి ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలని లేనిపక్షంలో ఎన్నికలు బహిష్కరిస్తామని రైతులు ధర్నా నిర్వహించారు. పిలాయిపల్లిలోని సాయి బాలాజీ రైస్ మిల్లు యజమాని లారీ డ్రైవర్, ఓనర్‌పై చేసిన దాడి నేపథ్యంలో మండల వ్యాప్తంగా లారీ డ్రైవర్లు, ఓనర్లు మూడు రోజుల పాటు బంద్ నిర్వహించారు. రైతుల సమస్యను పట్టించుకోవాలని, ధాన్యం కొనుగోలు వెంటనే చేపట్టాలని, రైసు మిల్లర్ల దోపిడీని, అధికారుల నిర్లక్ష్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు.

ఆందోళన విరమించిన లారీ డ్రైవర్లు

ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో అఖిలపక్షం నాయకులు, రైతులు, రైస్ మిల్లర్స్ యాజమాన్యం, లారీ డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ సభ్యులతో ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమస్యను పరిష్కరించే దిశగా చర్చలు నిర్వహించారు. లారీ డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ సభ్యులకు సాయి బాలాజీ రైస్ మిల్లు యజమాని క్షమాపణలు చెప్పడంతో సమస్య సద్దు మణిగింది. అనంతరం మిల్లర్లు, రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని వ్యవసాయాధికారులు పరిశీలించిన వెంటనే కొనుగోలు చేస్తామని ఎంపీపీ తెలిపారు. మిల్లులకు తరలించిన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని సూచించారు. దీనికి అంతా అంగీకరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, మరో 15రోజుల్లో మొత్తం ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ పాక వెంకటేష్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్లు కందాడి భూపాల్‌రెడ్డి, అందెల లింగంయాదవ్, వైస్ చైర్మన్ సామ మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, నాయకులు కళ్లెం రాఘవరెడ్డి, సామ మధుసూదన్‌రెడ్డి, పక్కీరు మల్లారెడ్డి, రైతు సంఘం నాయకుడు కోట రామచంద్రారెడ్డి, మన్నె పద్మారెడ్డి, పక్కీరు సుధాకర్‌రెడ్డి, లారీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు రమేష్, రమావత్ రాజు. తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి : జహంగీర్

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం జైకేసారం కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్ డిమాండ్ చేశారు. మంగళవారం జైకేసారంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రెండు నెలలు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గన్నీ బస్తాలు రాకపోవడంతో ధాన్యం పేరుకుపోతోందని విమర్శించారు. రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు చేయకపోతే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గంగాదేవి సైదులు, బూరుగు కృష్ణారెడ్డి, గడ్డం వెంకటేశం, చీరిక సంజీవరెడ్డి, రాగిరు కిష్టయ్య, పల్లె మధుకృష్ణ, పొట్ట శ్రీనివాస్, అలివేలు, బోదాసు వెంకటేశం, మాదగోని మారయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ దామోదర్‌రెడ్డికి కన్నీటి వీడ్కోలు

● నివాళులర్పించిన శాసనమండలి చైర్మన్ గుత్తా, పల్లా వెంకట్‌రెడ్డి

దేవరకొండ, మే 14: నల్లగొండ మాజీ ఎంపీ తుమ్మలపల్లి దామోదర్ రెడ్డి(85)కి కుటుంబసభ్యులు, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కన్నీటి వీడ్కోలు పలికారు. అశ్రునయనాల నడుమ హైదరాబాద్‌లోని ప్రశాంత్‌నగర్ మహాప్రస్థానంలో మంగళవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.దామోదర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 13వ తేదీన మృతి చెందారు. పీఏపల్లి మండలం అజ్మాపురం గ్రామానికి చెందిన దామోదర్‌రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నేతగా కొనసాగుతూ 1979 నుంచి 1984 వరకు నల్లగొండ ఎంపీగా వ్యవహరించారు.దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. దామోదర్‌రెడ్డి మృతదేహానికి మంగళవారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, కొండమల్లేపల్లి పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డిలతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల్లో బంధువులతో పాటు, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి

ట్రావెల్స్ బస్సు ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్ మృతి

● నల్లగొండ జిల్లా కేంద్రంలో ఘటన ● ఏపీ రాష్ట్ర ఓటర్లను హైదరాబాద్‌లో దింపి తిరిగి వెళుతుండగా ప్రమాదం

నల్లగొండ టౌన్, మే 14: అతివేగంగా బస్సు నడుపుతూ ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొనటంతో డ్రైవర్ మృతిచెందాడు. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై ఆర్జాలబావి సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. రూరల్ ఎస్‌ఐ శివకుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దవూర మండలం లింగపల్లి గ్రామానికి చెందిన పరంగి మహేష్ (24) పానగల్ ప్రాంతానికి చెందిన యాదయ్య వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం ఆర్జాలబావి నుంచి పానగల్ వైపునకు మట్టి లోడుతో బయలుదేరాడు. ఇదే క్రమంలో మార్నింగ్‌స్టార్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఏపీ రాష్ట్రంలో ఉన్న ఓటర్లను హైదరాబాద్‌లో దింపి ఆంధ్రప్రదేశ్ వైపు బయలుదేరింది.

బస్సును బాపట్లకు చెందిన వెంటాద్రి మణీంద్ర నడుపుతుండగా, ఆ సమయంలో ఎవరూ లేరు. అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై నల్లగొండ పట్టణ సమీపంలోని ఆర్జాలబావి సమీపంలోకి రాగానే అతివేగంతో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టి 10అడుగుల దూరం ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ పరంగి మహేష్ తీవ్ర గాయాలుకాగా, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడు మహేష్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. మహేష్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. ప్రమాద ఘటనతో అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోగా, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాలు వెళ్లేలా క్రమబద్ధీకరించారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ మణీంద్రను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



నల్లగొండ జిల్లా కేంద్రంలోని అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై ఆర్జాలబావి సమీపంలో ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

పిడుగుపాటుకు యువకుడు మృతి, ఇద్దరికి గాయాలు

● క్రికెట్ ఆడుతుండగా ఉరుములు, మెరుపులు ● చెట్టు కింది వెళ్లగా పిడుగుపాటు ● నల్లగొండ జిల్లా త్రిపురారం మండలంలో ఘటన

త్రిపురారం,మే 14: పిడుగుపాటుకు ఒక యువకుడు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. మంగళవారం నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం నీలాయిగూడెంలో ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సుమారు 25మంది యువకులు సాయంత్రం ఐదు గంటల సమయంలో గ్రామశివారులోని మైదానంలో క్రికెట్ ఆడుతున్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షపు జల్లులు పడటంతో యువకులు తలో దిక్కుకు వెళ్లారు. ముగ్గురు యువకులు పక్కనే ఉన్న జిల్లేడు చెట్టు సమీపంలో నిలబడ్డారు. ఆ సమయంలో చెట్టుపై పిడుగుపడటంతో అక్కడ నిలబడిన మర్రి రిషి (20) అక్కడికక్కడే మృతి చెందగా, పక్కనే ఉన్న చాగంటి సిద్ధు, దైవం ప్రదీప్‌లు సొమ్మసిల్లి పడిపోయారు. మిగిలిన యువకులు గ్రామస్థులకు సమాచారం ఇచ్చి, గ్రామంలో వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం ప్రదీప్ కోలుకోగా, సిద్ధును మెరుగైన చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు. అతనిఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. పిడుగుపాటు సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు చోటు చేసుకున్నాయి.

వేసవి సెలవులకు అమ్మమ్మ ఇంటికి వచ్చి....

నల్లగొండ మండలం వెలుగుపల్లికి చెందిన మర్రి రిషి (20) నీలాయిగూడెంలో అమ్మమ్మ అయిన గుండెబోయిన ముత్యాలమ్మ ఇంటికి వారం క్రితం రోజుల క్రితం వచ్చాడు. రిషి తండ్రి పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, తల్లి వీరలక్ష్మి హైదరాబాద్‌లో చిన్నపాటి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. రిషి తల్లి వద్ద ఉంటూ ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతుండగా, ఓ సోదరి ఉంది. పిడుగుపాటుకు రిషి మృతి చెందడంతో తల్లి బోరున విలపించింది. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు కుటుంబానికి ఆసరా అవుతాడని అనుకుంటే పిడుగుపాటుతో తనువు చాలించడంతో తల్లి వీరలక్ష్మి బోరున విలపించింది.


పిడుగుపాటుకు మృతి చెందిన రిషి (ఫైల్)


త్రిపురారం మండలం నీలాయిగూడెంలో పిడుగు పడిన జిల్లేడు చెట్టు

యాదాద్రి థర్మల్ బాయిలర్ ప్రాథమిక పరిశీలన

దామరచర్ల, మే 14: నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం, టీఎస్ జెన్‌కో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమలో మంగళవారం బాయిలర్ లైటప్ (వెలుతురులో సరిచూసుకోవడం) చేపట్టారు. 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో పరిశ్రమలో ఐదు యూనిట్ల పనులు కొనసాగుతున్నాయి. తాజాగా 1, 2 యూనిట్ల పనులు తుదిదశకు చేరుకోవడంతో ప్రాథమికంగా బాయిలర్లలోని ట్యూబ్‌లను పరిశీలించారు. ప్రత్యేకమైన ఆయిల్‌ను మండించి పైప్‌లలోని లీకేజీలు, లోపాలను గుర్తించే పనులు చేపట్టారు. బాయిలర్‌ను మండించగా దానికి అనుసంధానంగా ఉన్న చిమ్నీనుంచి పొగ బయటకు వచ్చింది. ప్రాథమిక పరిశీలనలో 1, 2 యూనిట్లలో ఎలాంటి లీకేజీలు లేనట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఈ ఏడాది చివరి నాటికి 1, 2 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించేలా పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆదేశించిన నేపథ్యంలో అధికారులు శరవేగంగా పనులు చేపట్టారు. పరిశ్రమలో ముడిసరుకు రవాణాకోసం చేపట్టిన రైల్వే ట్రాక్ నిర్వహణ పనులు సైతం వేగంగా జరుగుతున్నాయి. ఆగస్టు నాటికి రెండు యూనిట్లను ప్రారంభించేలా అధికారులు పనులను వేగవంతం చేశారు.


యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమ 1 యూనిట్‌లోని బాయిలర్‌ను మండిస్తున్న దృశ్యం, బాయిలర్‌ను మండించటంతో చిమ్నీ నుంచి పొగ వస్తున్న

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

భువనగిరి అర్బన్, మే 14: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి చెంత ఆంజనేయస్వామిని వేద మంత్రాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్ర నామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు చేపట్టారు. ప్రధానాలయంలోని స్వయంభూలను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచరాత్రాగమశాస్త్ర రీతిలో నిర్వహించారు. కొండపైన అనుబంధ శివాలయంలో పర్వతవర్థిని సమేతా రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్ఫటిక మూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవగామ పద్ధతిలో కొనసాగాయి. అనుబంధ పాతగుట్ట ఆలయం, విష్ణుపుష్కరిణి, కొండపైన శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.31,29,917ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.


ప్రధానాలయంలో నిత్యకల్యాణ పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు

వ్యవసాయ మోటార్లు చోరీ

మఠంపల్లి, మే 14: రైతులు అమర్చుకున్న వ్యవసాయ విద్యుత్ మోటార్లను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని వేములూరి ప్రాజెక్టు వద్ద సోమవారం రాత్రి జరిగింది. పాల్వాయి సైదమ్మ, సాముల నాగిరెడ్డిలకు చెందిన రెండు మోటార్లు, బానోతు పంతులు, యల్లావుల శివశంకర్, మల్లెబోయిన వీరబాబు, పులి కోటమ్మ, మాలోతు సోమ్లాలకు చెందిన ఒక్కో మోటార్లకు అపహరించుకుపోయినట్లు తెలిపారు. రూ.లక్షలు వెచ్చించి మోటార్లను వేములూరి ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసుకుంటే దొంగలు అపహరించడంతో తమకు ఆర్థికంగా నష్టం వాటిల్లిందని రైతులు వివరించారు. మోటార్లతోపాటు స్టార్టర్ బాక్సులు, కాపర్ వైర్లు ఎత్తుకెళ్లారని తెలిపారు. ఒకేరోజు తొమ్మిది మోటార్లను చోరీ చేశారు. ఇప్పటికైనా పోలీసులు గ్రామాల్లో రాత్రివేళల్లో గస్తీ నిర్వహించాలని కోరుతున్నారు.


మోటార్లను అపహరించుకుపోగా మిగిలిన పైప్‌లు

14 అడుగులకు నీటిమట్టం

జలకళ సంతరించుకున్న శాలిగౌరారం ప్రాజెక్టు



శాలిగౌరారం, మే 14: జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టు నీటిమట్టం మంగళవారం సాయంత్రం వరకు 14 అడుగులు చేరింది. ప్రాజెక్టు గరిష్ఠ స్థాయి నీటిమట్టం 21 అడుగులకు గాను ప్రస్తుతం 14 అడుగులు చేరి జలకళ సంతరించుకుంది. మూసీ నది నుంచి భారీగా నీరు ఫీడర్ ఛానల్ ద్వారా ప్రాజెక్టులోకి ఉధృతంగా వచ్చి చేరుతుంది. ఇప్పటికే ఫీడర్ ఛానల్ ఎగువ ప్రాంతాలలోని చెరువులు, కుంటలు నిండి అలుగు పోస్తున్నాయి. ప్రాజెక్టులోకి నీరు భారీగా వచ్చి చేరుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కట్టుదిట్టమైన భద్రత

పకడ్బందీగా ఎన్నికలు పూర్తి చేసిన అధికారులు, కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈవీఎంలను భద్రపరిచారు. యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో, నల్లగొండ జిల్లాకేంద్రంలోని గోదాములలో ఈవీఎంలను భద్రపరచగా, వాటిని ఎన్నికల అధికారులు, ఆయా జిల్లాల కలెక్టర్లు మంగళవారం తనిఖీ చేశారు. ఏర్పాట్లలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని సిబ్బంది ఆదేశించారు.

● స్టాఫ్ ఫొటోగ్రాఫర్ (నల్లగొండ, యాదాద్రి)



భువనగిరిలో ఈవీఎంలను స్ట్రాంగ్‌రూంలకు తరలిస్తున్న సిబ్బంది



నల్లగొండలో ఈవీఎంల గోదామును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందన దీప్తి



నల్లగొండలో రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న ఎస్పీ చందన దీప్తి

గెలుపు మాదంటే మాదే

● లెక్కలు వేసుకుంటున్న అభ్యర్థులు ● కొత్తగా చేరిన వారి ఓట్లపైనే చర్చ ● ఆ ఓట్లు తమవే అని ఎవరికి వారు అంచనాలు



దేవరకొండ, మునుగోడు, మే 14: పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపుపై కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన నేతలు ఎవరికివారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి పార్లమెంట్ అభ్యర్థిగా జానారెడ్డి కుమారుడు రఘువీర్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని, ఎస్ఎల్‌బీసీ, డిండి, నక్కలగండి, పెండ్లిపాకల ప్రాజెక్టులకు నిధులు కేటాయించి, పనులు పూర్తి చేస్తుందని, అందుకుగాను ఓటర్లు తమ వైపే మొగ్గు చూపారని కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుండడం, పంద్రాగస్టు తర్వాత రుణమాఫీ చేయడం, పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తుండడంతో కాంగ్రెస్‌వైపే ప్రజలు మొగ్గు చూపారని నేతలు చెబుతున్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్ఎస్ పాలనలో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశారని బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డిని ప్రజలు ఆదరిస్తారని బీఆర్ఎస్ నేతలు తెలుపుతున్నారు. ప్రధాని మోదీ దేశ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని, అందుకుగాను ప్రజలు బీజేపీ వైపు ఆకర్షితులై ఓట్లు వేశారని నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి సైదిరెడ్డి విజయంఖాయమని బీజేపీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు.

కండువాలు లెక్కకు వచ్చేనా ?

లోక్‌సభ ఎన్నికలు ముగిశాయి. ఇక ఎన్నికల లెక్కింపు ఫలితాలు వెలువడాల్సి ఉంది. ఇంతటితో ఓటర్ల పని పూర్తయినా నాయకులు, అనుచరులకు మాత్రం ఫలితాలు రావాలంటే 21 రోజులు నిరీక్షణ తప్పదు. పోలింగ్ ప్రక్రియ ఒక ఎత్తయితే.. ఆ తర్వాత ఫలితాలు వచ్చే వరకూ నిరీక్షించడం నాయకులకు మరో ఎత్తు కానుంది. ఎన్నికలు ముగియగానే ఫలితాల కోసం ఎంతో ఆసక్తి, ఉత్కంఠతో ఎదురుచూస్తారు. దేశవ్యాప్తంగా ఎన్నికలు పలు విడతల్లో జరుగుతుండటంతో అన్నిచోట్ల ఓటింగ్ పూర్తయిన తర్వాత జూన్ 4న ఫలితాలు వెలువరించనున్నారు. మహా సంగ్రామంలాంటి ఈ ఎన్నికల్లో ఫలితాలకోసం అభ్యర్థులతోపాటు సామాన్య జనం కూడా ఎదురుచూస్తున్నారు. 2019లో నిర్వహించిన లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ ముగిసిన తర్వాత 40 రోజులకు ఫలితాలు వెలువడగా.. ఇప్పుడు మాత్రం మూడు వారాలపాటు వేచి చూడాల్సిందే. అభ్యర్థులకు, అనుచరులకు ప్రజలకు తప్పదు పరీక్ష. అప్పటివరకు వేచి చూడల్సిందే. ఇదిలా ఉండగా ఎన్నికల సరళిపై పార్టీలవారీగా నాయకులు తమ అనుచరులతో కలిసి లెక్కలు వేసుకుంటున్నారు. ఎక్కడ ఎన్ని ఓట్లు పడ్డాయి.. ? మన పార్టీ పరిస్థితి ఏమిటనీ అనుకొంటూ ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలు లెక్కల్లో తలమునకలై ఉన్నారు. ఏ ఇద్దరు మాట్లాడుకున్నా.. ఆయాపార్టీల గెలుపు ఓటములపైనే చర్చలు సాగుతున్నాయి. ముఖ్యంగా ఈ ఎన్నికలు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్యే ముక్కోణపు పోరు సాగిందని తెలుస్తోంది. దీంతో ఆయా పార్టీల నాయకులు కార్యకర్తలు ఎక్కడికక్కడ అంచనాలు వేసుకుంటూ తమ అభ్యర్థులకు వచ్చిన ఓట్ల తీరుపై లెక్కలేసుకుంటున్నారు. మరోవైపు అభ్యర్థులు ఎవరికీ వారుగా విజయం తథ్యమనే భావనలో దీమాను తమ అనుచరుల వద్ద వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాలవారీగా ఏ పార్టీ ముందంజలో ఉండే అవకాశముందని బేరీజు వేసుకుంటూ అభ్యర్థుల స్థానాలపై ఒక అంచనాకు వస్తున్నారు.

పార్టీలు మారిన నేతలు

ఈ సారి ఎన్నికలు కొద్దిరోజుల ముందుగానే కార్యకర్తలే కాదు.. పెద్ద నాయకులు కూడా పార్టీలు మారారు. ఆ గట్టు నుంచి ఈ గట్టుకు వచ్చిన వారంతా ఓట్లు వేశారా..? అన్న ముచ్చట్లు పోలింగ్ ముగిసిన రోజు నుంచి సర్వత్రా చర్చలు వినిపించాయి. ఓటింగ్ సమయం ముగియగానే నాయకులు ఎన్నికల ఫలితాలపై ఎవరకివారు లెక్కలు వేసుకుంటారు. తమకు ఓట్లు ఎక్కడ పెరిగినయ్, ఎక్కడ తగ్గినయ్ అనే లెక్కలను కాగితాల మీద రాసుకుంటున్నారు. పార్టీలు మారిన నేతల కోసం కండువాలు తెప్పించిన లెక్కలు మాత్రం పార్టీల వద్ద పక్కాగా ఉన్నాయి. ఒకవేళ అవన్నీ అనుకూలంగా పడితే మన విజయం సునాయాసమని కొందరు అనుకుంటూ.. ఆ పార్టీలోకి వెళ్లిన వారంతా వాళ్లకే వేయరని, సగం తమకు వస్తాయని ఇంకో పార్టీ వారు అనుకుంటున్నారు. కానీ క్రాస్ ఓటింగ్ జరిగిందని ప్రచారం జోరుగా సాగుతోంది. సామాజిక వర్గాలవారీగా ఓటింగ్ అనూహ్య రీతిలో సాగినట్లు తెలుస్తోంది. ఎవరి అంచనా నిజమనేది తెలియాలంటే ఫలితాలొచ్చే వరకు ఆగాల్సిందే మరి.

ఫలితమివ్వని అధికారుల ప్రచారం

కేతేపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలానికి చెందిన 7,755 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోలేదు. ఓటు హక్కు కలిగిన వారంతా విధిగా ఓటు వేయాలని అధికార యంత్రాంగం పెద్దఎత్తున చేసిన ప్రచారం ఓటర్లను పోలింగ్ బూత్ వద్దకు తీసుకురాలేక పోయింది. దీంతో పోలింగ్ 74.81శాతం నమోదైంది. మండలంలోని 16 గ్రామాల్లో మొత్తం 30,788 మంది ఓటర్లుండగా 23,032 మంది ఓటర్లు మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 7,755మంది ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయారు. గత 10 రోజులుగా వేసవి ఎండ తీవ్రత అధికంగా ఉన్నా, పోలింగ్ డే రోజు మాత్రం వాతావరణం చల్లబడింది. అయినా ఓటర్లు పోలింగ్‌బూత్‌కు తరలి రాకపోవడానికి ఓటర్లలో ఓటింగ్‌పై అనాసక్తత పెరగడమేనంటున్నారు.ఎన్నికల సంఘం, రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పెద్ద ఎత్తున చేపట్టిన ప్రచారం ఫలితం ఇవ్వలేక పోయినట్లయ్యింది.

హమ్మయ్య ఎన్నికలు ముగిశాయ్


● అభ్యర్థులకు ఉపశమనం

యాదాద్రి, మే 14(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల హడావుడి మంగళవారంతో ముగిసింది. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం బరిలో ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు బీఆర్ఎస్‌నుంచి క్యామ మల్లేష్, కాంగ్రెస్ పార్టీ నుంచి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నుంచి మాజీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, సీపీఎం నుంచి ఎండీ జహంగీర్‌తోపాటు పలు పార్టీలకు చెందినవారు, స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో పోటీలో ఉన్న అభ్యర్థులకు కాస్త ఉపశమనం లభించింది. ఎన్నికల్లో పోటీచేసిన అన్ని పార్టీలకు చెందిన నిన్నటివవరకు పల్లెలు, పట్టణాల్లో ప్రచారం హోరెత్తించడంతోపాటు ఓటర్లను ఆకర్షించేందుకు కసరత్తు చేస్తూ రోజంతా హడావుడిగా గడిపారు. ఎన్నికలు ప్రశాంతంగా పూర్తవడంతో అభ్యర్థులకు ఆటవిడుపు లభించింది. దీంతో మంగళవారం అభ్యర్థులంతా కూడా తమ కుటుంబసభ్యులతో ఉండిపోయారు. ఎన్నికల్లో గెలుపుఓటములపై తమ అనుచరులతో చర్చలు జరిపారు. విజయంపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు.



భువనగిరిలో టిఫిన్ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

ఆర్టీసీకి ఎన్నికల ఆదాయం రూ.6.64కోట్లు



నల్లగొండ: పార్లమెంట్ ఎన్నికలతో ఆర్టీసీకి రూ.6.64కోట్ల ఆదాయం సమకూరింది. ఎన్నికల నేపథ్యంలో ఆర్టీసీ నల్లగొండ రీజియన్ నుంచి ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు వివిధ ప్రాంతాలకు మొత్తం 643 బస్సులు నడిపింది. మూడు రోజుల్లో సంస్థకు రూ.6,64,63,000 ఆదాయం వచ్చింది. దేవరకొండ డిపోకు రూ.1,28,40,000, నల్లగొండ డిపోకు రూ.1,15,91,000, నార్కట్‌పల్లి డిపోకు రూ.14,67,000, మిర్యాలగూడ డిపోకు రూ.1,05,29,000 ఆదాయం వచ్చింది. అదేవిధంగా యాదగిరిగుట్ట డిపోకు రూ.97లక్షలు, కోదాడ డిపోకు రూ.89.40లక్షలు, సూర్యాపేట డిపోకు రూ.1,13,97,000 ఆదాయం సమకూరింది.

రాత్రి 7గంటల వరకు పోలింగ్

చౌటుప్పల్ టౌన్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డి గూడెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన 28వ పోలింగ్ బూత్‌లో సోమవారం సాయంత్రం ఏడు గంటల వరకు పోలింగ్ కొనసాగింది. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ సమయం ముగిసే సరికి 108 మంది ఓటర్లు పోలింగ్ బూత్‌లో క్యూ కట్టి ఉన్నారు. సరిగ్గా ఆరు గంటలకు పోలింగ్ స్టేషన్ గేట్ మూసివేసి 108 మంది ఓటర్లకు ప్రత్యేకస్లిప్‌లు జారీచేసి ఓటు హక్కును వినియోగంచుకునేందుకు ఎన్నికల అధికారి హరికృష్ణ అవకాశం కల్పించారు. పోలింగ్ సమయం మించిపోయిన తరువాత కూడా ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించడం పట్ల ఓటర్లు హర్షం వ్యక్తంచేశారు. బూత్‌లో మొత్తం 1,360 ఓట్లకు 1,186 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పట్నానికి పయనం



హైదరాబాద్‌వైపు వెళుతున్న వాహనాలు

చౌటుప్పల్ టౌన్, మే 14: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని 65వ నంబరు జాతీయ రహదారిపై రెండో రోజు మంగళవారం రాత్రి వాహనాల రద్దీ కొనసాగింది. ఏపీలోని స్వగ్రామాల్లో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజలు తమతమ వాహనాల్లో హైదరాబాద్‌కు తిరుగుబాట పట్టారు. హైదరాబాద్‌లో స్థిరపడిన ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈ నెల 10వ తేదీ నుంచి నాలుగు రోజులపాటు ఏపీలోని సొంతూళ్లకు తరలివెళ్లి, సోమవారం నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో జాతీయ రహదారిపై వాహనాల రద్దీ నెలకొంది. ఏపీ నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న వాహనాలతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ కాకుండా ప్రత్యేక పెట్రోలింగ్‌ను నిర్వహిస్తున్నట్లు సీఐ అశోక్ రెడ్డి తెలిపారు.

రద్దీగా మల్లేపల్లి బస్టాండు

కొండమల్లేపల్లి: ఎన్నికల నేపథ్యంలో ఓటు వేసేందుకు స్వగ్రామాలకు వచ్చిన ఓటర్లు తిరుగు ప్రయాణం అవ్వడంతో కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. రెండు రాష్ట్రాల ప్రయాణికుల తాకిడితో బస్టాండు ప్రాంగణం కిటకిటలాడింది.



'కామినేని' విద్యార్థిని వినూత్న ఆవిష్కరణ

● కింది దవడ ఫిక్సేషన్ ప్లేట్‌కు ప్రత్యేక చికిత్స



విద్యాదేవి

నార్కట్‌పల్లి, మే14: డెంటల్ విభాగంలో నార్కట్‌పల్లి కామినేని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్స్‌లో ఓరల్ అండ్ మాక్సిల్లోఫేషియస్ సర్జరీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ వి.విద్యాదేవి వినూత్న ఆవిష్కరణ చేశారు. ఆమె చేసిన రూపకల్పనకు పేటెంట్ రిజిస్ట్రేషన్ సాధించి కళాశాలకు పేరు తెచ్చారు. ఈ విధమైన సర్టిఫికెట్ పొందడం అరుదైన విషయం. ఈ పేటెంట్‌ను గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారి ఐపీఆర్ సంస్థ ద్వారా సాధించి రీసెర్చ్ విభాగంలో ఒక మైలురాయిని చేరుకున్నారు. డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ డాక్టర్ పవన్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ మహేష్ సహకారంతో ఈ ప్రాజెక్టును సాధించానని డాక్టర్ విద్యాదేవి తెలిపారు. ఈ ప్రయోగంవల్ల విరిగిన దిగువ దవడ ఫిక్సేషన్ ప్లేట్‌కు ప్రత్యేకమైన చికిత్స విధానాన్ని ప్రవేశపెట్టగలిగామని ఆమె తెలిపారు. కామినేని మెడికల్ కళాశాల అధ్యాపకులు, పీజీ విద్యార్థులు ఈ సందర్భంగా అమెను అభినందించారు.

ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌గా నేహా ఎంపిక



నేహా

నేరేడుచర్ల, మే 14: ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ప్రభుత్వ రంగ సంస్థలో నేరేడుచర్లకు చెందిన వనపర్తి నేహా అత్యంత ప్రతిష్టాత్మకమైన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌గా ఎంపికయ్యారు. ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన ఈ ఉద్యోగ నియామకంలో 3.80లక్షల మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకాగా, వీరిలో 480మంది ఉత్తీర్ణత సాధించారు. నేహా అందులో ఒకరు. నేరేడుచర్లకు చెందిన వనపర్తి శ్రీనివాస్, సుజాత దంపతుల కుమార్తె నేహా స్థానికంగా పదో తరగతి వరకు విద్యనభ్యసించారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో, అనంతరం 2017లో వరంగల్ ఎన్ఐటీలో సీటు సాధించి 2018-22లో మెకానికల్ ఇంజనీంగ్ పూర్తి చేసింది. విద్యాభ్యాసం అనంతరం బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ఏటీసీ పరీక్షరాసి ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. తల్లి సుజాత గృహిణి కాగా, తండ్రి శ్రీనివాస ఫర్టిలైజర్ కంపెనీలో మేనేజర్‌గా పని చేస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లిలో ఒకరు, యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి, చౌటుప్పల్ మండలాల్లో ఒక్కొక్కరు చొప్పున మృత్యువాత పడ్డారు.



కుక్కడంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రెహమాన్

మాడ్గులపల్లి, మే 14: బస్సు ఢీకొని లారీ డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని కుక్కడం గ్రామ శివారులో అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శోభన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నయీం రెహమాన్(33) మధ్యప్రదేశ్‌లోని రాత్లం నుంచి చెన్నైకు మెంతుల లోడ్‌తో బయలుదేరాడు. కుక్కడం గ్రామ శివారులోకి రాగానే లారీ ఆపి రోడ్డు దాటుతుండగా నల్లగొండ నుంచి మిర్యాలగూడకు వస్తున్న బస్సు లారీ రెహమాన్‌ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మిర్యాలగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పజెప్పారు. లారీ డ్రైవర్ బామ్మర్ది సమీర్‌ఖాన్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చౌటుప్పల్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కార్మికుడు దుర్మరణం చెందారు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశా రాష్ట్రానికి చెందిన నికోల సబర్(28) స్థానిక పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఉదయం కిరాణ షాపునకు వెళ్లి వస్తూ రోడ్డు దాటుతుండగా రాంగ్ రూటల్ హైదరాబాద్ వైపు వెళ్తున్న బస్సు ఢీకొట్టింది. తీవ్ర గాయాలకు గురైన సబర్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భువనగిరి రూరల్: రైలు లోంచి జారిపడి ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మాయిపల్లి-నాగిరెడ్డిపల్లి రైల్వేస్టేషన్ల మధ్య మంగళవారం ఈ ఘటన జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎస్.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని 40 ఏళ్ల వయస్సుగల మహిళ రైలు లోంచి జారి పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలు ఎరుపు, నలుపు రంగు చీర ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని జిల్లాకేంద్ర ఆస్పత్రిలోని మార్చ్యూరీలో భద్రపరిచి కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. వివరాల కోసం సెల్:8712568454ను సంప్రదించాలన్నారు.

జూదరుల అరెస్టు

నిడమనూరు, మే 14: నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని గుంటుకగూడెం శివారులో పేకాట నిర్వహిస్తున్న శిబిరంపై దాడి చేసి తొమ్మిది మంది జూదరులను నిడమనూరు పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటుకగూడెం శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు మంగళవారం పేకాట శిబిరంపై దాడి చేయగా తొమ్మిది మంది పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. రూ.23 వేల నగదుతో పాటు 8 సెల్‌ఫోన్లు, నాలుగు పేకల సెట్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్టు చేసిన జూదరులు నిడమనూరు, ముప్పారం, గుంటుకగూడెం, అనుముల మండలం అలీనగర్‌కు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.

కృష్ణుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు

భువనగిరి రూరల్, మే 14: మద్యం మత్తులో ఆలయంలోకి చొరబడి శ్రీకృష్ణుడి పాలరాతి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ వి.సంతోష్‌కుమార్ తెలిపారు. పోలీసులు, గ్రామస్థుల వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన చిక్క శేఖర్ సోమవారం సాయంత్రం గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి మర్రి చెట్టు కింద కృష్ణుడి ఆలయంలోకి ప్రవేశించి కృష్ణుడి పాలరాతి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. దీంతో స్థానికుడు మచ్చ వెంకటనర్సయ్య పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు శేఖర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఈ రహదారి యమపురికి దారి

● ప్రమాదాలకు నిలయంగా మారిన నాగార్జునసాగర్ - హైదరాబాద్ హైవే ● కొరవడిన రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు



ప్రమాదకరంగా ఉన్న నాగార్జునసాగర్ - హైదరాబాద్ ప్రధాన రహదారి



పీఏపల్లి మండలం అంగడిపేట శివారులో జరిగిన రోడ్డు ప్రమాదం(ఫైల్)

దేవరకొండ, మే 14: హైదరాబాద్-నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ప్రమాదాలు జరిగినప్పుడే అధికారులు, ప్రజాప్రతినిధులు సంఘటన స్థలానికి చేరుకొని మృతుల కుటుంబాలను పరామర్శించి వెళుతున్నారే తప్ప నివారణ చర్యలు చేపట్టకపోవడంతో తరచు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ నెల 10న పీఏపల్లి మండలం అంగడిపేట శివారు నయా పెట్రోల్‌బంక్ వద్ద లారీ, ఆటో ఢీకొన్న సంఘటనలో గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మరియదాస్(45), ప్రకాశం జిల్లాకు చెందిన పెద్ద అంజమ్మ మృతి చెందగా మరో ముగ్గురుకి తీవ్ర గాయాలయ్యాయి. రాత్రి 11గంటలకు కొండమల్లేపల్లి నుంచి మాచర్ల వెళుతున్న లారీ ఆటోను అతివేగంగా ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న హెడ్‌కానిస్టేబుల్‌తోపాటు పెద్ద అంజమ్మ, మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. ఇలాంటి ఘటనలు హైదరాబాద్-నాగార్జునసాగర్ జాతీయరహదారిపై తరుచూ చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ఇటీవల ఎస్పీ చందన దీప్తి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. జాతీయ రహదారులు, మూలమలుపుల వద్ద రేడియం స్టిక్కర్లతో కూడిన బారీకేడ్లు, హెచ్చరికల బోర్డులు ఏర్పాటుచేసి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయినా ఈ జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అతివేగం, రోడ్డుపై అవగాహనలేకపోవడం, అజాగ్రత్త రోడ్డు ప్రమాదాలకు కారణాలవుతున్నాయి. ఏప్రిల్ 23న హైదరాబాద్ యాకత్‌పురకు చెందిన మహ్మద్ అజహర్, సమీరబేగం, జహీర్, మదియా స్నేహితులు విహారయాత్రకు హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్‌కు బయలుదేరారు. కారు అతివేగం కారణంగా పీఏపల్లి మండలం ఏఎమ్మార్పీ ఘనపురం స్టేజీ వద్దకు రాగానే హెచ్‌ఎండబ్ల్యూఎస్ గేట్‌వాల్‌ను కారు అతివేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో అజహర్, సమీరబేగం అక్కడికక్కడే మృతి చెందగా కారులో ప్రయాణిస్తున్న జహీర్, మదియాలకు తీవ్రగాయాలయ్యాయి. ఇలాంటి సంఘటనలు తరచు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడే అధికారులు, ప్రజాప్రతినిధులు ఘటనా స్థలానికి చేరుకొని రోడ్డు ప్రమాద మృతులను పరామర్శించి వెళుతున్నారే తప్ప నివారణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎస్పీ ఆదేశాలమేరకు జాతీయ రహదారిపై మలుపుల వద్ద ప్రమాద హెచ్చరికల బోర్డులు, స్టిక్కర్లు, ఇతర జాగ్రత్తలు తీసుకొని ప్రమాదాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సాగర్-హైదరాబాద్‌పై నిత్యం ప్రమాదాలు జరిగే ప్రాంతాలు

నాగార్జునసాగర్ - హైదరాబాద్ జాతీయ రహదారి శేరిపల్లి, చెన్నారం మలుపు, కొండమల్లేపల్లి జోగ్యతండా, చిన్న అడిశర్లపల్లి మలుపు, ప్రశాంతపూరితండా, వింజమూరిగేటు, నసర్లపల్లి, వెంకటంపేట, మదనాపూర్, గణపురం, కోదండాపూరం గేటు, దేవరకొండ మండలం కొండభీమనపల్లికి వెళ్లే రోడ్డు.

రోడ్డు ప్రమాదాలు జరగడానికి ప్రధానకారణాలు

నాగార్జునసాగర్ - హైదరాబాద్ జాతీయ రహదారిపై అతివేగంగా వాహనాలు నడపడం, హెచ్చరికల బోర్డులు లేకపోవడమే. డ్రైవర్లకు రహదారిపై అవగాహనలేకపోవడం. నిబంధనలు పాటించని డ్రైవర్లపై కేసులు నమోదు చేయకపోవడంతోపాటు పోలీసుల తనిఖీలు లేకపోవడంతో ప్రతీ సంవత్సరం ఏదో ఒక పెద్ద ప్రమాదం జరగడం, పదుల సంఖ్యలో ప్రజలు మృత్యువాత పడుతున్నారు. ప్రమాద సూచికలు, హెచ్చరిక బోర్డులు, విస్తృత తనిఖీలు నిర్వహించి రోడ్డు ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నాం. నాగార్జునసాగర్-హైదరాబాద్ జాతీయ రహదారిపై మలుపుల వద్ద హెచ్చరికల బోర్డులు, సిగ్నల్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నాం. వాహనాలను అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపవద్దు. పోలీస్ శాఖ సూచించిన నియమాలను పాటించి జాగ్రత్తలు తీసుకోవాలి.

గిరిబాబు, డీఎస్పీ, దేవరకొండ

విద్యుదాఘాతంతో ఆవు మృతి

కొండమల్లేపల్లి, మే 14: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. ఈ ప్రమాదం నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు కూర లింగయ్య తనకున్న నాలుగు పశువులను మేతకోసం తీసుకెళ్లాడు. సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ తీగలు మేత మేస్తున్న ఆవుకు తగలడంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.30వేలు ఉంటుందని బాధితుడు వివరించాడు.

అవినీతికి వ్యతిరేకంగా యువత ఉద్యమించాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నవీన్

ఆలేరు రూరల్, మే 14: అవినీతికి వ్యతిరేకంగా యువత ఉద్యమించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బుగ్గ నవీన్ పిలుపునిచ్చారు. మండలంలోని శర్బణాపురంలో మంగళవారం జరిగిన డీవైఎఫ్ఐ సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువజన విద్యార్థి, నిరుద్యోగులపై అవలంభిస్తున్న విధానాలు సరైనవి కాదన్నారు. భగత్‌సింగ్, రాజ్యాంగ స్ఫూర్తితో యువత చైతన్యం చేయాల్సిన అవసరముందన్నారు. ఈ సమావేశంలో నాయకులు గడ్డమీది ప్రశాంత్, నరేష్, మల్లేశం, నవీన్, శ్రీకాంత్, కిరణ్ తదితరులు ఉన్నారు.

'ఉపాధ్యాయులపై లాఠీచార్జి అమానుషం'

భువనగిరి టౌన్, మే 14: ఎన్నికల విధుల నిర్వహణ భృతి చెల్లింపుల్లో తేడాపై ప్రశ్నించిన ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించిన నారాయణ్‌ఖేడ్ ఆర్డీవోపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మిరియాల దామోదర్, మెతుకు సైదులు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జీవో ప్రకారం పీవో, ఏపీవోలకు రూ.3150 రావాల్సి ఉండగా రూ.2400 చెల్లిస్తుండటంపై ప్రశ్నించిన టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి. లక్ష్మారెడ్డితో పాటు ఉపాధ్యాయులపై నారాయణఖేడ్ ఆర్డీవో సోమవారం రాత్రి పోలీసులతో లాఠీచార్జీ చేయించడం అమానుషమన్నారు.

గ్రామీణ కళాకారులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్

ఆలేరు రూరల్, మే 14: గ్రామీణ ప్రాంత కళాకారులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ప్రజా నాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ కోరారు. మండలంలోని శారాజీపేటలో మంగళవారం జరిగిన రేణుక ఎల్లమ్మ కోలాట బృందం సమావేశంలో మాట్లాడారు. కళాకారులకు గుర్తింపు కార్డులతో వడ్డీ లేని రుణాలు ఇవ్వాలన్నారు. రూ.5లక్షల వరకు ఆర్థిక సాయం అందించాలన్నారు. సమావేశంలో లక్ష్మీ, ఎలేంద్ర, నర్సమ్మ, అనిత పాల్గొన్నారు.

పామాయిల్ తోట దగ్ధం



తోటలో కాలిపోయిన డ్రిప్ సిస్టమ్, వైర్లు, పైపులు

ఆలేరు రూరల్, మే 14: మంటలు అంటుకొని పామాయిల్ తోటల దగ్ధమైంది. ఈ సంఘటన మండలంలోని కొలనుపాక గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన గోపి శ్రీనివాస్‌రెడ్డి, తనకున్న 12 ఎకరాల భూమిలో ఫాం అయిల్ తోటలను సాగు చేస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున మంటలు అంటుకోవడంతో తోటతో పాటు తోటలో ఉన్న డ్రిప్ కూడా పూర్తిగా దగ్ధమైంది. దీంతో సుమారు రైతుకు రూ.70లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

ఓటర్లకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు : జహంగీర్



మాట్లాడుతున్న జహంగీర్

భువనగిరి టౌన్, మే 14: ఎన్నికల ప్రచారంలో సహకరించిన కార్యకర్తలు, పోలింగ్ రోజు ఆదరించిన ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ. జహంగీర్ అన్నారు. భువనగిరిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గెలుపుఓటములతో నిమిత్తం లేకుండా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్నామన్నారు. సీపీఎం ఎప్పటికీ ప్రజల పక్షమే ఉంటుందన్నారు. ఇతర పార్టీల ప్రలోభాలకు, ఒత్తిడికి లొంగకుండా పనిచేసిన సీపీఎం నాయకులకు, కార్యకర్తలకు రుణపడి ఉంటానన్నారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తి చాటాలని కోరుతుటున్నట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేస్తామన్నారు.

మార్పులకు అనుగుణంగా విద్యాబోధన



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

భువనగిరి టౌన్, మే 14: విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా భువనగిరిలోని జినియస్ హైస్కూల్‌లో విద్యాబోధన చేస్తుందని కరస్పాండెంట్ డాక్టర్ బి. సూర్యనారాయణరెడ్డి, చైర్మన్ పడాల శ్రీనివాస్, డైరెక్టర్ తోట శ్రీధర్ అన్నారు. సీబీఎస్ పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మంగళవారం అభినందించారు. మరోమారు 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. 500 మార్కులకుగాను, సిహెచ్ చిన్మాయి 461, జి అక్షిత 446, ఎం. స్వరహాసిని 433 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి. స్వర్ణలత, ఏవో జి. రవి తదితరులు పాల్గొన్నారు.

గతంకంటే తక్కువగా..

● తుంగతుర్తి నియోజకవర్గంలో 13.57శాతం తగ్గిన పోలింగ్



మోత్కూరు, మే 14: తుంగతుర్తి నియోజకవర్గంలో 2023 నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోల్చుకుంటే ఈనెల 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ తగ్గింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో 87.63 శాతం పోలింగ్ జరగగా, ఈ ఎన్నికల్లో 74.06 శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది. 13.57శాతం పోలింగ్ తగ్గింది. నియో జకవర్గంలో 2,59,265 మంది ఓటర్లు ఉండగా 1,91,845 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల నాటి కంటే ఈ ఎన్నికల్లో నియోజకవర్గంలో 4,248 మంది ఓటర్లు పెరిగారు. అయినా ఓటింగ్ శాతం మాత్రం తగ్గింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన అభ్యర్థులు ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, హైదరా బాద్, చెన్నై దూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లకు రవాణా చార్జీలు ఇచ్చి ఓటు వేయడానికి పిలిపించుకున్నారు.

అధికంగా అర్వపల్లిలో.. తక్కువగా నాగారంలో..

నియోజకవర్గంలోని అర్వపల్లి మండలంలో అధికంగా 77.64శాతం పోలింగ్ నమోదు కాగా నాగారం మండలంలో తక్కువగా 71.89 శాతం పోలింగ్ నమోదైంది. అడ్డగూడూరు మండలం మానాయకుంట గ్రామంలో ఇతర ప్రాంతాల్లో ఉన్నవారిని ఓ పార్టీ వారు పిలిపించుకోవడంతో అక్కడ 87.85శాతం ఓటింగ్ నమోదైంది. ఇక్కడ 790 ఓట్లు ఉండగా 694 ఓట్లు పోలయ్యాయి. మద్దిరాల మండలం ముకుందాపురం గ్రామంలో తక్కువగా 64.14 శాతం పోలింగ్ నమోదైంది. ఇక్కడ 2128 ఓట్లు ఉండగా 1356 ఓట్లు పోలయ్యాయి. మండలాల వారీగా మోత్కూరు మండలంలో 9.77శాతం, అడ్డగూడూరు మండలంలో 14.46 శాతం, శాలిగౌరారం మండలంలో 13.73శాతం, అర్వపల్లి మండ లంలో 11.96 శాతం, నూతనకల్ మండలంలో 14.31 శాతం, మద్దిరాల మండలంలో 15.50 శాతం, తుంగతుర్తి మండలంలో 13.55 శాతం, నాగారం మండ లంలో 15.19 శాతం, తిరుమలగిరి మండలంలో 13.32 శాతం ఓటింగ్ తగ్గింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో 2,55,017 ఓట్లు ఉండగా 2,23,163 ఓట్లు పోలయ్యాయి. 1,13,229 మంది పురుషులు, 1,09,932 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో 2,59,265 ఓట్లు ఉండగా 1,91,845 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అందులో పురుషులు 97,197 మంది, మహిళలు 94,644 మంది ఉన్నారు.

మెజార్టీపై ఎవరి ధీమా వారిదే..

భువనగిరి పార్లమెంట్ పరిధిలోని తుంగతుర్తి నియోజకవర్గంలో ఎవరికి వారు తమ పార్టీ అభ్యర్థికే మెజార్టీ వస్తుందని, అభ్యర్థి విజయానికి తోడ్పడుతుందని కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు లెక్కలు వేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తమకు వచ్చిన ఓట్లు ఈ సారి కూడా వస్తాయని, కాంగ్రెస్ ఓట్లు బీజేపీకి భారీగా క్రాస్ అయి త్రిముఖ పోటీ జరిగి తమ అభ్యర్థి మల్లేష్‌యాదవ్ గెలుస్తాడని బీఆర్ఎస్ నాయకులు అంటున్నారు. కాంగ్రెస్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చి ఊపు ఇక్కా తగ్గలేదని, సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఉచిత బస్సు సౌకర్యం, ఉచిత గృహ విద్యుత్, రూ.500లకు గ్యాస్ సిలిండర్ పథకాలు కూడా ప్రజల అభిమానాన్ని చూరగొన్నాయని దీంతో తమకు భారీ మెజార్టీనే వస్తుందని కాంగ్రెస్ నాయకులు లెక్కలు వేస్తున్నారు. బీఆర్ఎస్ ఓట్లే బీజేపీ అభ్యర్థికి క్రాస్ అవుతాయని, తమ ఓట్లు బీజేపీ పడవని కాంగ్రెస్ నాయకులు గట్టిగా నమ్ముతున్నారు. మోదీ ఆకర్షణతో యువతలో కొందరు బీజేపీ వైపు మొగ్గినా మెజార్టీ తగ్గుతుందేమోగాని గెలుపకు ఎలాంటి ఢోకా ఉండదంటున్నారు. 2014లో బూర నర్సయ్య గౌడ్ ఎంపీగా గెలిచి ఈ ప్రాంతానికి సుపరిచితుడుగా ఉన్నారని, బీఆర్ఎస్ నాయకులతో ఆయనకు ఇప్పటికీ పరిచయాలు ఉన్నాయని, కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీల ఓట్లు తమకు క్రాస్ అవుతాయని బీజేపీ నాయకులు అంటున్నారు. గౌడ సామాజిక వర్గం ఓట్లు కూడా నియోజకవర్గంలో గణనీయంగా ఉన్నాయని, అవి బీజేపీ అభ్యర్థికే పడతాయంటున్నారు. కాంగ్రెస్, బీఆర్ ఎస్ అభ్యర్థులు ఈ ప్రాంత ఓటర్లకు కొత్తవారైనందున బీజేపీ అభ్యర్థి నర్సయ్య గౌడ్‌కు మోదీ చరిష్మా తోడై గెలుస్తారని బీజేపీ నాయకులు లెక్కలు వేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీకి క్యాడర్ లేకపోయినా యువత, ఇతర పార్టీల నుంచి జరిగే క్రాస్ ఓటింగ్‌పైనే బీజేపీ ఆశలు పెట్టుకుంది.

తుంగతుర్తి నియోజకవర్గంలో పోలైన ఓట్లు ఇలా..

మండలం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పురుషులు	మహిళలు	శాతం
మోత్కూరు	27,074	20,339	10,289	10,050	75.12
అడ్డగూడూరు	22,769	16,865	8,652	8,213	74.07
శాలిగౌరారం	40,410	29,580	14,954	14,624	73.20
అర్వపల్లి	24,171	18,766	9,461	9,305	77.64
నూతనకల్	28,582	20,976	10,650	10,326	73.39
మద్దిరాల	25,078	18,056	9,139	8,917	72.00
తుంగతుర్తి	33,971	24,883	12,669	12,214	73.25
నాగారం	24,246	17,430	8,804	8,624	71.89
తిరుమలగిరి	32,964	24,950	12,579	12.371	75.69
మొత్తం	2,59,265	1,91,845	97,197	94,644	74.06

భువనగిరి నియోజకవర్గంలో 82.71శాతం పోలింగ్

భువనగిరి రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా భువనగిరి నియోజకవర్గంలో 82.71 శాతం పోలింగ్ నమోదైంది. భువనగిరి అసెంబ్లీ సెగ్మెంట్‌లో 257 పోలింగ్ కేంద్రాలు ఉండగా నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,20,596 ఉండగా అందులో 1,08,801 పురుషులు, 1,11,794 మహిళలు, 1 ఇతరులు ఉన్నారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో 1,82,462 ఓట్లు పోల్ అయ్యాయి. అందులో పురుషులు 92,017, మహిళలు 90,445 ఉన్నారు. పోచంపల్లి మండలంలో అత్యధికంగా 86.62 శాతం భువనగిరి మండలంలో అత్యల్పంగా 80శాతం ఓట్లు నమోదయ్యాయి.

నియోజకవర్గంలోని మండలాల వారీగా..

భువనగిరిలో మొత్తం 86,414 ఓట్లకు గాను 69,129 (80శాతం) ఓట్లు పోల్ అయ్యాయి. అదే విధంగా బీబీనగర్‌లో మొత్తం 42,134 ఓట్లకు గాను 35,770 (84.90 శాతం) ఓట్లు పోల్ అయ్యాయి. భూదాన్ పోచంపల్లిలో మొత్తం ఓట్లు 43,269 ఓట్లకు గాను 37480 (86.62 శాతం) ఓట్లు పోల్ అయ్యాయి. వలిగొండలో మొత్తం ఓట్లు 48,779 ఓట్లకు గాను 40,083 (82.17 శాతం) ఓట్లు పోలయ్యాయి.

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

రామన్నపేట, మే 14: కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తిచేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్లలో ధాన్యం పోసి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ 50శాతం ధాన్యం కొనుగోళ్లు జరగలేదన్నారు. మండల వ్యాప్తంగా 26కేంద్రాల్లో ఐదు లక్షల బస్తాలు మాత్రమే తూకం వేశారని, ఆరు లక్షల బస్తాలు వానకు నాని, ఎండకు ఎండుతున్నాయని తెలిపారు. రెండు రోజుల్లో కొనుగోళ్లను పూర్తి చేయాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జల్లెల పెంటయ్య, సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, నాయకులు వనం ఉపేందర్, రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు గన్నెబోయిన విజయభాస్కర్, బోయిన ఆనంద్, కందుల హనుమంతు, బల్గూరి అంజయ్య, కల్లూరి నగేష్, బావండ్లపల్లి బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలు భద్రంగా..

భువనగిరి జిల్లాకేంద్రంలోని ఆరోరా కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో ఈవీఎంలను భద్రపరిచారు. భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆ పార్టీ నాయకులతో కలిసి స్ట్రాంగ్‌రూం వద్దకు వచ్చారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో పోటీలో ఉన్న అభ్యర్థులకు కాస్త ఉపశమనం లభించింది. ఎన్నికల్లో గెలుపు ఓటములపై తమ అనుచరులతో చర్చలు జరిపారు.



ఈవీఎంలు ఉన్న పెట్టెలను స్ట్రాంగ్‌రూంకు తరలిస్తున్న సిబ్బంది



ఈవీఎంలను తరలించేందుకు వచ్చిన కంటైనర్లు



సీసీకెమెరా పర్యవేక్షణలో స్ట్రాంగ్‌రూం

గంటల వ్యవధిలోనే పార్టీలు మారి..



ఉదయం బీజేపీ కండువా, సాయంత్రం కాంగ్రెస్ కండువా

మోత్కూరు, మే 14: ఎన్నికల ముందు బలం పెంచుకోవడానికి పార్టీల నాయకులు ఎదుటి పార్టీల నాయకులను బతిమిలాడో, ఆశ చూపో తమ పార్టీలోకి లాక్కోవడం సహజం. ఎన్నికలు ముగిసినా మోత్కూరు మండలంలో పొద్దునో పార్టీ, సాయంత్రం మరోపార్టీ అన్న చందంగా పార్టీలు మారడం కొనసాగుతూనే ఉంది. వివరాల్లోకి వెళితే బీజేపీ మండల ఉపాధ్యక్షుడు గూడె మధుసూదన్ మంగళవారం కాంగ్రెస్ నాయకుడు కందికట్ల యమకాంత్ గౌడ్‌కు పార్టీ కండువా కప్పి బీజేపీ పాలడుగు గ్రామ శాఖ అధ్యక్షుడిగా నియమించారు. కొన్ని గంటల వ్యవధిలోనే ఏం జరిగిందో గాని యమకాంత్‌గౌడ్ తిరిగి సొంత గూటికి చేరగా, కాంగ్రెస్ నాయకుడు అంతటి ఉపేందర్ అతనికి కాంగ్రెస్ కండువా కప్పారు.

సెల్వరాజు ఆశయాలు కొనసాగించాలి

రాజాపేట, మే 14: తమిళనాడు ఎంపీ సెల్వరాజు ఆశలను కొనసాగిందాం అని సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు కోరారు. మంగళవారం రాజాపేట మండలం బేగంపేట గ్రామంలో మండల కార్యదర్శి చిగ్గుల లింగం అధ్యక్షతన ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. అంతకుముందు సెల్వరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కావేరి నదీ జలాల కోసం పోరాటం నిర్వహించి సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోల్గారి రాజయ్య, చెడుదిపు రామస్వామి, మోల రాంచందర్, జెల్ల వెంకటయ్య, రాములు, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం

వలిగొండ, మే 14: మండలం కేంద్రంలో సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయ కరెంట్ ఫిడర్‌లోని లైను కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు ఉదయం 7 గంటల నుంచి 10 గంటలవరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ మచ్చేందర్ తెలిపారు. ఈ విద్యుత్ అంతరాయనానికి రైతులు, గ్రామస్థులు సహకరించాలని కోరారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

రాజాపేట, మే 14: రాజాపేటలో రేణుకుంట గ్రామానికి చెందిన తంబూనూరి లక్ష్మణ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన కుటుంబానికి రాజాపేట ఉన్నత పాఠశాల 1995-96 ఎస్ఎస్‌సీ బ్యాచ్ మిత్రులు, పూర్వ విద్యార్థులు మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. లక్ష్మణ్ కూతురు పేరున రూ.45వేలు ఫిక్స్ డిపాజిట్ చేశారు. వారినిచేసి గ్రామస్థులు అభినందించారు.

చౌటుప్పల్ 'కౌన్సిల్' చుట్టూ మలుపులు

● ఏ కౌన్సిలర్ ఏ పార్టీలో ఉన్నారో తెలియని అయోమయం, ● పలు మలుపులు తిప్పిన మునుగోడు ఉప ఎన్నిక, అసెంబ్లీ సాధారణ ఎన్నికలు

చౌటుప్పల్ టౌన్, మే 14: పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు చౌటుప్పల్ మునిసిపల్ కౌన్సిలర్లు చిన్నాభిన్నం చేశాయి. ఎవరు ఏ పార్టీలో ఉన్నారో అర్థం కానీ పరిస్థితి. ప్రస్తుతం కౌన్సిల్‌లో మొత్తం 20 మంది కౌన్సిలర్లు ఉండగా, అందులో కాంగ్రెస్‌కు చైర్మన్‌తో కలిపి 14మంది, సీపీఎంకు ముగ్గురు, బీఆర్ఎస్‌కు ఒకటి, బీజేపీకి ఇద్దరు కౌన్సిలర్లు ఉన్నారు. మునిసిపాలిటీలోని 20 వార్డులకు 2020 జనవరి 27 న జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ 8 వార్డులు, కాంగ్రెస్ 6 వార్డులు, బీజేపీ 3వార్డులు, సీపీఎం 3వార్డులు గెలుచుకున్నాయి.

మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఎం కలిసి పోటీ

మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఎం పొత్తు పెట్టుకొని పోటీ చేశాయి. కాంగ్రెస్ మద్దతుతో గెలిచిన సీపీఎం కౌన్సిలర్లు చైర్మన్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించడంతో పట్టణంలో పెద్ద అలజడి చెలరేగింది. సీపీఎం కౌన్సిలర్ల ఇళ్లతో పాటు ఆ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ మద్దతుదారులు దాడులు చేశారు. తీవ్రమైన గందరగోళ వాతావరణం మధ్య సీపీఎం మద్దతుతో బీఆర్ఎస్‌కు చెందిన 16వ వార్డు కౌన్సిలర్ వెన్‌రెడ్డి రాజు చైర్మన్‌గా, బీఆర్ఎస్ మద్దతుతో సీపీఎంకు చెందిన 19వ వార్డు కౌన్సిలర్ బత్తుల శ్రీశైలం వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

మునుగోడు ఉప ఎన్నిక ప్రభావం

2022 డిసెంబరు 7న జరిగిన మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా బీఆర్ఎస్‌కు చెందిన 4 వ వార్డు కౌన్సిలర్ అంతటి విజయలక్ష్మి తో పాటు కాంగ్రెస్‌కు చెందిన మెత్తం ఆరుగురు కౌన్సిలర్‌లు బీజేపీలోకి వెళ్లారు. అదే బీజేపీకి చెందిన 3వ వార్డు కౌన్సిలర్ బండమీది మల్లేశం, 6 వ వార్డు కౌన్సిలర్ ఆలె నాగరాజు బీఆర్ఎస్ గూటికి చేరారు. దీంతో మునుగోడు ఉప ఎన్నికల నాటికి కౌన్సిల్‌లో కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం లేకుండా పోయింది. బీజేపీ బలం మూడు నుంచి ఎనిమిది కి , బీఆర్ఎస్ బలం ఎనిమిది నుంచి తొమ్మిదికి పెరిగింది.



చౌటుప్పల్ మునిసిపల్ కార్యాలయం

సాధారణ అసెంబ్లీ ఎన్నికల నాటికి..

2023 నవంబరు 30వ తేదీన జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు బీఆర్ఎస్‌కు, ఏడుగురు కౌన్సిలర్లు బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కౌన్సిల్‌లో కాంగ్రెస్ బలం సున్నా నుంచి ఎనిమిదిగా మారింది. బీఆర్ఎస్‌కు ఏడుగురు కౌన్సిలర్లు ఉండగా, బీజేపీ కి ఒక కౌన్సిలర్ మిగిలారు.

పార్లమెంట్ ఎన్నికల నాటికి..

2024 మే 13 న జరిగిన పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ కు చెందిన ఆరుగురు కౌన్సిలర్‌లు కాంగ్రెస్‌లోకి వెళ్లగా, ఒక బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆలె నాగరాజు మాత్రం తిరిగి బీజేపీలో చేరారు. దీంతో ప్రస్తుతం మునిసిపాలిటీలో కాంగ్రెస్‌కు చైర్మన్‌తో కలిపి కౌన్సిలర్ల సంఖ్య 14కు చేరగా, బీఆర్ఎస్‌కు 12వ వార్డు కౌన్సిలర్ తాడూరు శిరీషా మాత్రమే మిగిలారు. బీజేపీకి ఇద్దరు కౌన్సిలర్లు ఉన్నారు.

ఆరుగురు కౌన్సిలర్‌లతో ప్రారంభమై..

కౌన్సిల్‌లో ఆరుగురు కౌన్సిలర్‌లతో ప్రారంభమైన కాంగ్రెస్ బలం మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నికల నాటికి సున్నాకు పడిపోయింది. మళ్లీ అసెంబ్లీ సాధారణ ఎన్నికల నాటికి తిరిగి పుంజుకొని ఎనిమిదిగా నిలిచింది. పార్లమెంట్ ఎన్నికల నాటికి ఏకంగా తన బలాన్ని 14 కు పెంచుకున్న కాంగ్రెస్ రాజకీయంగా పట్టు సాధించింది. మునుగోడు ఉప ఎన్నిక నుంచి పార్లమెంట్ ఎన్నికల వరకు జరిగిన రాజకీయ పరిణామాలు పలు మలుపులు తిరిగాయి. చైర్మన్‌తో పాటు ఏడుగురు కౌన్సిలర్లను బీఆర్ఎస్, ఒక కౌన్సిలర్‌ను బీజేపీ కోల్పోయాయి.